కథ

చీకటి

ఎ. సుబ్బారావు

మూడువంతులు కృంగిన సూర్యుడు, తన తీవ్రతని పోగొట్టుకున్నాక, నారింజరంగు దుస్తులు ధరించి ప్రజల మీద కనికరం ప్రదర్శిస్తున్నాడు. కృంగిన తన రథాన్ని లేవనెత్తుతూ, కర్ణుడు అర్జునుని అర్థించినట్లు, చీకటిని ఆగమంటున్నాడు సూర్యుడు. పదిహేను నిమిషాలలో సూర్యుడిని మింగి, భూమిమీద దుప్పటి పరచి నిద్రపోవడానికి ఆయత్తమయింది చీకటి.

చిక్కని చీకటి! చీకటిలో వికృతమైన కీచురాళ్ళ శబ్దం!

''లోపలికి వెళ్దామా? లేక కాస్సేపు కూర్చుందామా?'' అనడిగాడు రవి.

''మరీ ఇంత నిశ్శబ్దంగా ఉంటే, ప్రపంచంలో నేనొక్కడినే మిగిలినట్టు అనిపించి భయం వేస్తుంది. దాని మాట ఎలా ఉన్నా దోమల బాధ ఎక్కువగా ఉంది'' అంటూ చేతిమీద రద్దుకున్నాడు గోపి.

ఇద్దరూ దిగి గదిలోనికి వచ్చారు.

ట్యూబ్‌లైటు వెలుతురులో, పాలిపోయిన మొహం, రేగిన జుత్తు, నలిగిన బట్టలలో ఉన్న రవి, బధిర్లో వేసిన లారెన్స్ ఒలీవియర్‌ని జ్ఞాపకానికి తెచ్చేడు.

''ఆశ్చర్యంగా ఉందా? మనం అందరమూ ముసుగు వేసుకుని తిరుగుతాం. అప్పుడప్పుడు అది జారి నిజ రూపం బయట పడినపుడు, మనుషులు దారుణంగా కనిపిస్తారు. కూర్చో'' అంటూ కుర్చీ చూపించి తానొక కుర్చీలో చతికిలపడ్డాడు రవి.

''చీకటి పడుతుంటే నీలవేణి గుర్తుకు రాకుండా ఏ రోజూ వెళ్ళదు. వెలుగు నోచుకొని నీలవేణి'', అంటూ ఫ్లాస్కు తెరచి, కాఫీని రెండు కప్పులలోనికి నింపాడు రవి. ఒకటి తను అందుకుని రెండవది గోపీకి అందిచ్చాడు.

ఒక గుక్క తాగి, 'ఇంత స్ట్రాంగ్ కాఫీ ఎలా తాగుతారండీ, రాత్రి నిద్రపడుతుందా?'' అని ఆశ్చర్యపడ్డాడు గోపి.

''ఇదొక చేదా? కొందరి జీవితాలలో ఉన్న చేదుతో లెక్కపెడితే ఇదెంత? ఒక విధంగా నీలవేణి చావుకి నేనూ ఒక కారణమే'', అంటూ కాఫీ రెండు గుటకలువేసి,

''అబ్బ! అంత వెలుతురు కళ్ళలో పడుతుంటే అబద్ధాలాడాలని పిస్తుంది. నిజం చీకటిలోనే బయటికి వస్తుంది. నీకభ్యంతరం లేకపోతే వెలుతురు తగ్గిస్తాను'', అంటూ ట్యూబులైటు ఆర్పి బెడ్‌రూమ్ లైటుని వెలిగించాడు రవి.

''ఎవరీ నీలవేణి?''

''నేను మెడికల్ రిప్రజెంటిటివ్‌గా పని చేస్తూ ఊరూర్లూ తిరిగిన రోజులవి. నేనూ సత్యం రెండు విదేశీ మందుల కంపెనీలకి ప్రతినిధులుగా పని చేసేవాళ్ళం. నా వయస్సు అప్పుడు ఇరవై ఐదు. సత్యం నాకంటే మూడు, నాలుగేళ్ళు పెద్ద. డాక్టర్ల గుమ్మాలు ఎక్కి దిగేటప్పుడు పలకరించుకుని, లోకాభి రామాయణం ముచ్చటించుకునే వాళ్ళం. ఒక రోజు సాయంకాలం పెద్దాపురం వెళ్ళాను. రాత్రికి కాకినాడ తిరిగి వెళ్ళాలని ఉద్దేశ్యం. పని పూర్తియే సరికి రాత్రి దాదాపు తొమ్మిదిన్నరయింది. రోడ్డు మీదికి వచ్చాను బస్ కోసం. ఎండా కాలం, వేడి గాలులు దుమ్మును రేపుతున్నాయి. చేతిలో బరువైన మెడికల్ సేంపిల్స్ సంచి, టై వేసుకున్న చొక్కా చెమటకి తడిసి శరీరాన్ని అంటుకుని ఉంది. దాని మీద దుమ్ము, రెండు, మూడు బస్సులు ఖాళీ లేదంటూ ఆగకుండా దూసుకుపోయాయి. ఏం చేయాలో తెలియక అయోమయంగా రోడ్డుమీద పచార్లు చేస్తున్నాను. మరొక అరగంట గడిచింది. బస్సులు రాలేదు.

''కాకినాడ వెళ్ళాలా? కత్తిపూడి దగ్గర ఏదో జాతర. ఈ వేళ ఇక్కడ బస్సులు దొరకడం కష్టమే'', అంటూ దగ్గరగా వచ్చి పలకరించాడు సత్యం. ఒక్కసారి ప్రాణం లేచి వచ్చింది.

''కాకినాడ వెళ్ళకపోతే రాత్రి ఇక్కడ ఎలా గడపడం? ఈ ఊరిలో మంచి లాడ్జింగ్స్ లేవు'' అన్నాను నేను.

''లాడ్జింగ్స్ కావాలేమిటి? కాస్త దూరవే ఉండాలి కాని రాత్రికి ఆతిథ్యానికేం మహబాగుంటుంది, రండి నాతో'', అంటూ మందహాసం చేస్తూ ముందర నడిచాడు. అతనిని అనుసరించేను నేను. రెండు, మూడు వీధులు దాటేక, సత్యం ఓ డాబా ఇంటిలోనికి ప్రవేశించి, ''వేణీ! ఈయన పేరు రవి. ఈ రాత్రికి ఆతిధ్యం కావాలి ఈయనకి. ఏం చేస్తాయనీ ఇష్టం'', అంటూ కర్ర ఉయ్యాల ఊగుతున్న స్త్రీ దగ్గరికి నడిచేడు. ఉయ్యాల ఆపి,

ఆమె లేచి నిలబడింది. నీలవేణిని చూడడం అదే మొదటిసారి. రంగు చెప్పలేని కల్నేత చీర, ఆకట్టిన తీరే నన్ను ఆకర్షించిందో, ఫేన్ గాలికి ఎగిరే ఆమె జుత్తే నన్ను మత్తెక్కించిందో, తీర్చి దిద్దిన ఆ కాటుకకళ్ళే నన్ను ఆకట్టుకున్నాయో, ఆ స్వచ్ఛమైన నున్నటి మొహమే నన్ను పరవశ పరిచిందో చెప్పలేను. వీటన్నింటికీ తోడు మొహం మీద పుట్టుమచ్చ. ఆమెది మిరుమిట్లు గొలిపే అందంకాదు. కాని ఆ చేతుల మధ్య ఒక్కసారి ఇమిడితే, కౌగిలిలో లోకాన్నే మరచిపోతాం అనిపించింది. నాకు నోటమాట రాలేదు. అది గమనించి.

''ఏమిటి అలా చిత్తరువై పోయారు?'' అంటూ కిసుక్కున నవ్వింది. శబ్దం లేని నవ్వు, ఎంత బాగా నవ్విందో! నేనేమీ సమాధానమీయలేదు. నవ్వినపుడు మీదకి లేచిన చెక్కిళ్ళ ఎత్తులోంచి లీలగా కనిపించే బుగ్గమీద సొట్టని చూస్తూ నన్ను నేను మరచిపోయాను.

పెద్దాపురంలో కలవమని కబురుపడితే, నీలవేణి ఇంటికి వెళ్ళేను. సత్యం జాడలేదు. నీలవేణి జ్వరంతో మూలుగుతోంది. ఆమె నుదుట మీద చేయివేసి చూడగా జ్వర తీవ్రత తెలిసింది. నా దగ్గర ఉన్న మందు ఇచ్చి, ఎదురుగా కూర్చున్నాను. తెలియకుండా నిద్రపట్టి తెల్లవారింది. నేను కుర్చీలో కూర్చుని నిద్రపోయానని నొచ్చుకుని, మందు ఇచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పింది. కొన్నాళ్ళ తరువాత సత్యం కనిపించినపుడు,

''నీలవేణి నీ గురించి వాకబు చేసింది, పెద్దాపురం వెళ్తే వెళ్ళి చూడు'' అన్నాడు.

ఓ రోజు నీలవేణిని చూడడానికి వెళ్ళాను. నేనొక్కడినే రావడం చూసి,

''సత్యం రాలేదా?'' అనడిగింది. నేను తల అడ్డంగా ఆడించాను.

ఆతృతగా మిలమిలా మెరిసిన కళ్ళు, సత్యం కనిపించక కాబోలు నిరాశపడ్డాయి. ఆ వేళ రాత్రి నీలవేణి శరీరంతో చెలగాట మాడాను, తరువాత

ఏం జరిగినదీ ఇప్పుడు జ్ఞాపకానికి రావడం లేదు.

నీలవేణి ఇంటికిఅవతల ఉన్న 'వసంత' ఇంటిలో నాకు ఆతిథ్యాన్ని ఏర్పరచింది నీలవేణి.

సత్యం నన్నుఅక్కడకి తీసుకెళ్ళి వదిలాడు.

స్త్రీతో మొదటి అనుభవం అది. మొదటి అనుభవం జ్ఞాపకం ఉంటుందంటారు. ఎంత ప్రయత్నించినా ఇప్పుడు వసంత రూపం గుర్తుకు రాదు.

అది జరిగేక సత్యంతో పరిచయం పెరిగింది.

ఒక రోజు సత్యం తనని నీలుంటే

ఆరేడుసార్లు ఆమెను చూడడానికి వెళ్ళాను.

నీలవేణితో కబుర్లతో పడితే, నీలవేణి వేసే ప్రశ్నలన్నీ సత్యం గురించే, సత్యం ప్రసక్తి రాగనే ఆమె కళ్ళలో వెలుగు, మొహం లోనికి రక్తం చిమ్మడాన్ని గమనించాను. సత్యం వచ్చినపుడు నీలవేణి అలంకరణ ఒక కొత్త రూపం దాల్చేది. 'సత్యాన్ని ఆమె ప్రేమిస్తోంది' అని స్పష్టంగా తెలియవస్తోంది. డబ్బుకి శరీరాన్ని అమ్ముకునే వ్యక్తికి ప్రేమేమిటి? అన్న ప్రశ్న నాలో ఎప్పుడూ ఉదయించలేదు. ఒక వ్యక్తి, ఇంకొక వ్యక్తిని ప్రేమిస్తోంది, అంతే!

సంవత్సరం గడిచేలోగా సత్యం తన పెళ్ళి నిశ్చయమైందని చెప్పేడు. ఆ వార్తనే అందచేసినపుడు, నీలవేణి కళ్ళలో కదలాడిన దిగులు నేనెన్నటికీ మరచిపోలేను. ఏమైనా చేసి ఆ దిగులుని పొగొట్ట గలిగితే ఎంత బాగుండును? అనిపించింది కాని ఏం చేయగలను?

ఆ రాత్రి, నీలవేణి, 'నిద్ర పట్టడం లేదు, నిద్ర మాత్రలు ఉంటే ఇవ్వరూ?' అంటూ నా దగ్గర నిద్ర మాత్రల సీసా తీసుకుంది. అదే ఆఖరుసారి నే నీలవేణిని చూడడం. సత్యం పెళ్ళయిన పది రోజులకి కాబోలు,

నిద్రమాత్రలు మింగి, ఆత్మహత్య చేసుకుంది. షాక్ తిన్నాను. అయితే నీలవేణి గతం తెలిసినపుడు దిగ్భ్రాంతి చెందాను, అంటూ శూన్యం లోనికి చూస్తూ కణత నొక్కుకున్నాడు రవి.

గోపి ఏమీ మాటలాడలేదు. కప్పులో మిగిలిన చేదు కాఫీని పూర్తిగా త్రాగేసి, కప్పు టేబిల్ మీద ఉంచుతూ తిరిగి ప్రారంభించేడు రవి.

''నీలవేణి ఆరుగురు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు ఉన్న బీద కుటుంబంలోంచి వచ్చింది. తిండికీ, బట్టకీ ఇరకాట పడుతూ ఎలాగో మెట్రిక్యులేషన్ అయిందనిపించింది. తెల్లవారు తోందంటే భయపడే రోజుల్లో, ఇల్లుదాటి, సత్యంతో పట్నం వచ్చింది. అప్పటికి సత్యానికి ఈ ఉద్యోగం లేదు. ఆ పరిస్థితులలో

ఏక్సిడెంట్ అయి మంచానపడిన సత్యం కోసం, నీలవేణి తన శరీరాన్ని మొట్టమొదటిసారి అమ్ముకుంది. సత్యం తిరిగి మామూలు మనిషయేలోగా చాలా చేతుల క్రింద ఆ గులాబీ నలిగింది. తరువాత సత్యానికి ఉద్యోగం వచ్చినా, ఎందువలనో ఆమె చరిత్రలో మార్పు రాలేదు. నాకు అది ఈనాటికీ శేష ప్రశ్నే!

''స్త్రీ జీవితంలో ఒకేసారి ప్రేమిస్తుంది'', అంటే నేను నమ్మే వాడిని కాను. అయితే నీలవేణిని చూస్తే దానిలో నిజం ఉందనిపించింది. ఆమె సత్యాన్ని ప్రేమించిన మాట, ఆమె సత్యం కోసం అభిసారికలా తయారవడం చూసి ఇట్టే చెప్పవచ్చు.

''సత్యాన్ని ప్రేమిస్తున్నావా?'' అని నేను నీలవేణిని ఎప్పుడూ నిలదీయలేదు, అథవా ప్రశ్నించినా నీలవేణి చిరునవ్వు నవ్వేసి ప్రశ్నని దాటవేసేది!'' అంటూ ముగించేడు రవి.

నిశ్శబ్దంలో కీచురాళ్ళ శబ్దం వికృతంగా వినిపించ సాగింది.

''రవీ, మీరు నీలవేణిని ప్రేమించారా?'' అనడిగేడు గోపి.

''నేనా? నీలవేణినా?''

''ఏం అలా అడిగారు? మలినమైన నీలవేణిని ఎలా ప్రేమిస్తాను అంటారా?''

''ప్రేమకి మనస్సో, శరీరమో ఏదో ఒకటైనా కావాలి. ఆమె మనస్సుని సత్యం ఆక్రమించుకున్నాడు. డబ్బు ఇచ్చి ఆమెతో చెలగాటమాడేటప్పుడు ఆమె ఒళ్ళు అచేతనం. స్పందన లేదు. బహుశా సత్యానికే అది స్పందిస్తుంది. డబ్బు ఇచ్చినందుకు ప్రతిఫలంగా ఒళ్ళుని యాంత్రికంగా అప్పచెప్తోంది, అంతే. ఆ రెండూ నీలవేణి దగ్గర లభించవు. కాని ఆమెకి మాలిన్యం అంట గట్టలేం'' అన్నాడు రవి.

''తన గురించి ఆహుతి అయిన స్త్రీని వదిలేసిన సత్యాన్ని క్షమించలేం. సత్యం సగటు మనిషి. నీలవేణిని పెళ్ళి చేసుకునే ధైర్యం లేదని తెలుస్తోంది.

అయితే ఇలాంటివి సామాన్యం, ఆశ్చర్య పడడానికి ఏమీ లేదు.

మీరు నీలవేణిని ప్రేమించలేదన్నారు అది నిజంకాదు. ఆమె మనస్సు పరాధీనమైనా, ఆమె నలిగిన గులాబి అయినా, మీకు ఆమె అంటే గౌరవం, కాంక్ష ఇన్నాళ్ళయినా సమసిపోలేదు. నీలవేణి ఆత్మహత్య చేసుకుంది అన్నప్పుడు మీ కంటిలో తిరిగిన నీటి చెమ్మ, ఆమెని ప్రేమించేరనడానికి ఒక నిదర్శనం. పర్యవసానం బట్టి, లాభ నష్టాలు చూసి ఈమెని ప్రేమించవచ్చా? చేయకూడదా? అని ఎంచుకుని చేసేది ప్రేమ కాదు. ఇవేవీ చూసుకోకుండా దానంతట అదే జరుగుతుంది ప్రేమ. ఇప్పుడు అప్రస్తుతం అనుకోండి, ఆమెని పెళ్ళి చేసుకుంటానని మీరు ఎందుకు ముందుకు రాలేదు''? అనడిగాడు గోపి.

''ఆలోచించు, కొన్ని ప్రశ్నలకి సమాధానం ఈయకపోతేనే బాగుంటుంది. లే క్లబ్‌కి వెళ్దాం'' అంటూ గోపీని లేవదీశాడు రవి.

★